క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



కొణిదేలలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో ఎంపీపీ నిధుల కింద మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ చందమాల సురేష్ మంగళవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, అజీజ్, శంకర్, గురుస్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు



పాములపాడు: మండల కేంద్రంలో మంగళవారం కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. పాత ఇనుప స్తంభాలు తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటుకు విద్యుత్‌శాఖ శ్రీకారం చుట్టింది. ఎక్కడా ఇనుప విద్యుత్ స్తంభాలు కానరాకూడనే లక్ష్యంతో.. వడివడిగా మారుస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలో 6 కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగింది.

నాగంపల్లి సొసైటీ ద్వారా రూ.కోటి రుణాలు



జనార్దన్‌రెడ్డి

కొత్తపల్లి: ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి గాను నాగంపల్లి సహకార సొసైటీ ద్వారా కోటి రూపాయాల రుణాలను రైతు నేస్తం, రాజన్న నేస్తం పథకాల ద్వారా అందించేందుకు మంజూరు చేసిందని నాగంపల్లి సింగిల్ విండో ౘైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అర్హత ఉండి అవసరమైన రైతులు సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇదివరకు కూడా రూ.కోటి నిధులు మంజూరు అయ్యాయని, వాటని మార్టిగేజ్ కింద 12 మంది రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా మండలంలోని 9 గ్రామపంచాయతీలలో రూ.4.65 కోట్ల నాబార్డు నిధులతో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను నిర్మిస్తున్నామని చెప్పారు.

రైతులకు సకాలంలో సమాచారమివ్వాలి

పాములపాడు: సరైన సమయంలో రైతులకు సమాచారమివ్వాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. మంగళవారం స్థానిక ఆర్బీకేలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాఖా పరంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏఎస్‌ఓ నిర్మల, ఏఈఓ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో 20.4 మి.మీల వర్షపాతం

కొత్తపల్లి: మండలంలో సోమవారం రాత్రి మోస్తరు వర్షం పడింది. గువ్వలకుంట్ల, వీరాపురం, లింగాపురం, శివపురం, గోకవరం, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, ఎదురుపాడు, జడ్డువారిపల్లె, సింగరాజుపల్లె, బట్టువారిపల్లె గ్రామాలతో సహా మండల కేంద్రంలో 20.4 మి.మీల వర్షపాతం నమోదు అయిందని ఏఎస్‌ఓ రాజ్‌పాల్ మంగళవారం తెలిపారు. ఈ వర్షం కొంతమేర పంటలకు ఊరటనిచ్చింది. దీంతో మరలా రైతన్నల్లో ఖరీఫ్ ఆశ చిగురించింది.

పోస్టర్ల విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్/నందికొట్కూరు/ఆత్మకూరు: దేశంలో రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల అధిక ధరలు, పెరిగిపోతున్న నిరుద్యోగంపై దేశ వ్యాప్తంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు చేపట్టే సమరభేరిని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సున్నిపెంటలోని కార్యాలయం వద్ద, నందికొట్కూరులో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో, ఆత్మకూరు సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులు సమరభేరి పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజశేఖర్, రణధీర్, నాయకులు మునిపాటి చిన్నమార్నెన్న, మల్లికార్జున, పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు అభివృద్ధికి సహకారం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి
- ఎంపీ నిధులు రూ. 3. 50 కోట్లు విడుదల
- షాదీఖానా నిర్మాణానికి శాప్ ౘైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో కలిసి భూమిపూజ



షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ పోచా, శాప్ ౘైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తానని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 6వ వార్డులో షాదీఖానా నిర్మాణానికి ఎంపీ పోచా, శాప్ ౘైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి భూమి పూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ నిధులు రూ. 3.50 కోట్లను విడుదల చేయడం జరిగిందన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మాణానికి సంపూర్ణ సాయం అందిస్తానని స్పష్టం చేశారు. టీడీపీ పాలనలో నంద్యాల పార్లమెంట్‌లో అభివృద్ధి శూన్యమన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉందని గుర్తు చేశారు. తెలుగు తమ్ముళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారే తప్ప చేసిందేమి లేదని మండిపడ్డారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు గడప గడపకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని చెప్పారు.

టీడీపీ నాయకులకు అభివృద్ధి కనిపించలేదా?

నెలకు ఒక్కసారో, ఆరు నెలలకు ఒక్కసారో వచ్చే తెలుగు దేశం పార్టీ నాయకులకు నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధి కనిపించలేదా అని రాష్ట్ర మాజీ శాప్ ౘైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం 95 శాతం అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తెచ్చి సంక్షేమ పథకాల లబ్ధి కోసం మధ్య దళారీలు, పైరవీరుల చుట్టు తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా సీఎం వైఎస్ జగనన్న బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారని గుర్తు చేశారు. స్పెషల్ ఫండ్ రూ. 16 కోట్లు, 14వ ఆర్థిక, 15వ ఆర్థిక నిధులు, జనరల్ ఫండ్ కలిపి రూ.14 కోట్లతో పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణ ప్రధాన రహదారి నిర్మాణానికి ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకొన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ౘైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ ౘైర్మన్ ప్రశాంతి, జెడ్పీటీసీలు జగదీశ్వరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, పుల్యాల దివ్య, మార్కెట్‌యార్డు వైస్ ౘైర్మన్ షరీఫ్, మాజీ మార్కెట్ యార్డు ౘైర్మన్ శివరామకృష్ణారెడ్డి, నాయకులు చంద్రమౌళి, జబ్బార్, సలాం, అబుబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రారంభం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి ఆలయానికి వెళ్లే గ్రావెల్ రహదారిని ఎంపీ నిధులు రూ. 35 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు. పూర్తయిన రహదారి నిర్మాణ శిలాఫలాకాన్ని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఏపీ శాప్ ౘైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామస్వామిరెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి, ఆలయ ౘైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, మున్సిపల్ ౘైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, నాగతులసిరెడ్డి, తువ్వా శివరామకృష్ణారెడ్డి, పేరెడ్డి వెంకటరామిరెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి, రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల పిల్లలు జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: అపరిచిత వ్యక్తుల పట్ల పాఠశాల విద్యార్థులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో మంగళవారం పిల్లల స్నేహపూర్వక న్యాయసేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పాఠశాలలో, ఇతర చోట్ల అపరిచిత వ్యక్తులతో మాట్లాడేటప్పుడు ఎలాంటి జాగ్రత్త తీసుకోవాలి, వారి మాటతీరు పట్ల ఎలాంటి స్పందించాలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని చెప్పారు. పిల్లలపై లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రతి శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సూర్యకుమారి, ఎమ్‌ఈఓ జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కొత్తపల్లి: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా విద్యాశాఖ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో 5 నుంచి 18 సంవత్సరాలలోపు వారిని గుర్తించి బడులలో చేర్పించాలని సూచించారు. ఏ విద్యార్థికూడా ఏ కారణంగా బడి మానుకోకుండా చూసుకోవాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్‌తో సురక్షిత నీరు

నందికొట్కూరు: జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తున్నట్లు జల్ జీవన్ మిషన్ కర్నూలు జిల్లా ప్రాజెక్టు సభ్యులు భీమశంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జల్ జీవన్ మిషన్‌పై ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ నీటి పారిశుద్ధ్య కమిటీలో అంగన్‌వాడీ వర్కర్స్ కీలక పాత్ర పోషిస్తూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సచివాలయంలో ఫీల్డ్ టూల్ కిట్‌ను అందుబాటులో ఉంచుతామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటేశ్వరమ్మ, అనురాధ, ఆశీర్వాదమ్మ, నిర్మల, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తా ఉన్న నాయకుడు సీఎం వైఎస్ జగన్

వెలుగోడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 4, 5వ సచివాలయాల పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బీమ సౌకర్యంపై చైతన్యవంతం చేశారు. తిరుపంరెడ్డి మాట్లాడుతూ.. గత నాలుగేళ్లలో రాష్ట్రం, ప్రజలు సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్, వైస్ ఎంపీపీ నసీరుద్దీన్, వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.ఇలియాస్ ఖాన్, మండల కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఏర్వ శ్యామలమ్మ, సుబ్బమ్మ, షాషా ఖాద్రి, కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ఈఓ కృషి

మహానంది: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. మంగళవారం రాత్రి ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ముందుగా సూపరింటెండెంట్ అన్నెం ఈశ్వర్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం అధ్యక్షుడు రవిశంకర అవధాని మాట్లాడుతూ గత 18ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరేళ్ల ఇంక్రిమెంట్, పీఆర్సీ, పాత డీఏ బకాయిలతో పాటు సెలవు జీతాల బకాయిలు మంజూరు చేశారన్నారు. సుమారు రూ.90లక్షలు చెల్లింపులు చేశారని, ఈఓను సన్మానించేందుకు తీర్మానించినట్లు చెప్పారు. సమావేశంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలి

పాములపాడు: పంటల ఎదుగుదలకు రైతులు ఇష్టానుసారంగా ఎరువులు వాడరాదని, భూసార పరీక్షల ప్రకారం వచ్చిన ఫలితాల ఆధారంగా వాడుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో భూసార పరీక్షల ప్రాముఖ్యత, సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు ప్రతి 3 సంవత్సరాలకు ఒక సారి చేయించాలన్నారు. ఎకరానికి మొక్కజొన్నకు సూక్ష్మ పోషకాలైన జింక్ సల్ఫేట్ 20 కేజీలు, బోరాన్ 2 కేజీలు వేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బెట్టనుంచి పంటలను కాపాడుకోవడానికి ఎకరాకు యూరియ లేదా డీఏపీ 4కేజీలు, 13–0–45 2 కేజీలు, 200 లీటర్ల నీటిలో కలిపి పంటపై వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ షబ్బీర్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

మిడుతూరు: మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్ఎం కిశోర్ అన్నారు. మండలపరిధిలోని కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థి సంఘం నాయకులు రామ్, బాలకృష్ణ, పాల్గొన్నారు.

తేనె కన్నా తియ్యనిది తెలుగుభాష

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కవి సమ్మేళనంలో కవులు వేషాల్లో విద్యార్థులు

మహానంది: తేనె కన్నా తియ్యనిది, వెన్న కన్నా కమ్మనిది మన తెలుగు భాష అని మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య తెలిపారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు దూర్జటి, ఆదికవి నన్నయ్య, నంది తిమ్మన, అల్లసాని పెద్దన్న, రామరాజ భూషణుడు తదితరుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. గాజులపల్లె గ్రామానికి చెందిన భజనగురువు ఖాసీంసాహెబ్ ఆధ్వర్యంలో కోలాటం, చెక్కభజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, డాక్టర్ నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల కవిసమ్మేళనం

తెలుగు భాష దినోత్సవం సందర్భంగా బండిఆత్మకూరు మండలంలో మంగళవారం ఘనంగా జరిగాయి. బండిఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం నూర్జహాన్, శింగవరంలో హెచ్ఎం దస్తగిరి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శింగవరంలో విద్యార్థులు నిర్వహించిన కవిసమ్మేళనం ఆకట్టుకుంది.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిన మహానుభావుడు

నందికొట్కూరు: తెలుగు భాష ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటిన మహానుభావుడు గిడుగు రామ్మూర్తి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.సునీత, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎం. అన్వర్ హుసేన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాల, ఆర్టీసీ డిపోలో డీఎం నాగేశ్వరరావు, బసిరెడ్డి, డిగ్రీ కళాశాల, శ్లోక స్కూల్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తాజుద్దీన్, డాక్టర్ రఘుపతిరెడ్డి, భాస్కర్, ఝాన్సీరాణి, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మంగన్న అధ్యక్షతన తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం హెచ్ఎం మంగన్న, తెలుగు ఉపాధ్యాయుడు శంకర్, రామచంద్రలను పూల మాలలు, దుశ్శాలువలతో సన్మానించారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ జయంతి

పగిద్యాల: గిడుగు వెంకటరామ్మూర్తి, కెప్టెన్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి దినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలను మంగళవారం నెహ్రూనగర్, పగిద్యాల, ముచ్చుమర్రి, పడమర ప్రాతకోట, లక్ష్మాపురం తదితర పాఠశాలల్లోని ఉపాధ్యాయులు వైభవంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత తెలుగు తల్లి వేషధారణ, కోలాటాలు, జానపద గేయాలతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి పిల్లల్లో ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, హెచ్ఎంలు మధుసూదన్‌రావు, జరీనా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.పి హుస్సేన్‌బాషా తెలుగు భాష ఔనత్యం గురించి, గిడుగు రామ్మూర్తి అందించిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.కె.రాజన్న, మహేశ్వరరెడ్డి, బుచ్చయ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్‌ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం తెలుగుభాషా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ డీఎం మహేంద్రుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిగ్రీ కళాశాల తెలుగు ఉపాధ్యాయురాలు సుజాతను సన్మానించారు. పట్టణంలోని పుల్లారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కరెస్పాండెంట్ వెంకటేశ్వరరావు, సాయిప్రవీణ్, హెచ్ఎం చాంద్‌బాషా, మండలంలోని వెంకటాపురం హైస్కూల్‌లో హెచ్ఎం శ్రీనివాసులు తెలుగు భాష ప్రాధాన్యతను, గిడుగు రామ్మూర్తి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం అహ్మద్, రమణ, స్నేహలత, మంజువాణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల విన్యాసాలు

వెలుగోడు: జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. హెచ్ఎం సత్యనారాయణ రావు, భాషా ఉపాధ్యాయుడు, ప్రముఖ క్రీడాకారుడు మహమ్మద్ ఫైజుల్లా, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

మహానంది: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని మహానంది వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సంతోష్‌నాయక్, డాక్టర్ ఎంఎస్ రాహుల్, డాక్టర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సున్నిపెంటలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



దుద్యాలలో ఉపాధ్యాయుల సన్మానం



వెలుగోడులో స్పోర్ట్స్ డే అక్షరాలతో విద్యార్థులు



శింగవరంలో విద్యార్థుల కవిసమ్మేళనం



ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు సుజాతను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతి ఇంటా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- బ్రాహ్మణకొట్కూరులో రెండో రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం'

నందికొట్కూరు రూరల్ : రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పేద ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని లబ్ధిదారులకు వివరించి, బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సీఎంకు అందరూ అండగా ఉండాలని కోరారు. అనంతరం పలువురు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిసర్వోత్తమరెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వనజ, మాధవరం రత్నం, సీఐ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



ప్రముఖులకు మెమొంటోలు అందిస్తున్న దృశ్యం

మహానంది: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ౘైర్మన్ విజయ్‌కుమార్ మంగళవారం రాత్రి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని ఆయనకు స్వాగతం పలికారు. వైఎస్సార్ జిల్లా జోన్ ౘైర్మన్ మాధవరెడ్డి, తిరుపతి జోన్ ౘైర్మన్ సంతోష్‌కుమార్‌లతో కలిసి వచ్చిన వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక కల్యాణ మండపంలో వారికి స్వామి,అమ్మవారి ప్రసాదాలతో పాటు మెమంటోలు అందించి వేదాశీర్వచనం చేశారు.

మోసగాడి అరెస్ట్

మహానంది: ఉద్యోగాలిప్పిస్తానని, మైనింగ్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే సంపాందిచొచ్చని మోసం చేసిన అఖిల్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మహానంది సీతారామాపురం గ్రామానికి చెందిన బాలిరెడ్డితో మైనింగ్‌లో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించి రూ.70లక్షలు వసూలు చేశాడన్నారు. అదే గ్రామానికి చెందిన నరసింహాచారి వద్ద ఉద్యోగం ఇప్పిస్తానని రూ.15లక్షలు ఇప్పించుకున్నాడన్నారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అఖిల్‌రెడ్డిని అరెస్ట్ చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

ఘర్షణలో ఒకరి అరెస్ట్..

మహానంది మండలం గాజులపల్లె, బసవాపురం గ్రామాలకు చెందిన యువకుల మధ్య పబ్‌జీ గేమ్ విషయంలో జరిగిన ఘర్షణలో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. బసవాపురం గ్రామానికి చెందిన ఠాగూర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

రహదారి పనుల నిలిపి వేత

మిడుతూరు: జలకనూరు, తలముడిపి గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ భూముల గుండా కొందరు రోలర్‌తో అక్రమంగా చేపడుతున్న రోడ్డు పనులను రెవెన్యూ సిబ్బంది మంగళవారం నిలిపివేశారు. రోడ్డు నిర్మాణ విషయం తహసీల్దార్ ప్రకాష్‌బాబు దృష్టికి వెళ్లడంతో.. అక్కడికి వెళ్లి పరిశీలించాలని ఆయన రెవెన్యూ సిబ్బందిని ఆదేశంచారు. ఈ మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు సంజీవ్ కుమార్, రమణారెడ్డి భూములను పరిశీలించారు. పని ప్రదేశంలో వర్కర్లు మాత్రమే ఉండటంతో పనులు చేపట్టవద్దని నిలిపివేయించారు.

గంగమ్మా.. భువికి దిగిరావమ్మా



నదికొట్కూరులో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న రైతులు

పాములపాడు: పైర్లు ఎండుతున్నాయని.. గంగమ్మ భువికి దిగి రావమ్మ అని వేడుకుంటూ మంగళవారం మండలంలోని లింగాల గ్రామంలో రైతులు పూజలు నిర్వహించారు. గ్రామంలోని యువకులు, రైతులు బిందెలు చేత బూని శివునికి జలాభిషేకం చేశారు. అనంతరం నది ఒడ్డున గంగమ్మ ప్రతిమ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

నందికొట్కూరు: వర్షం కోసం రైతులు మంగళవారం సుంకులమ్మకు బోనాలు సమర్పించి, పూజలు చేశారు. పట్టణంలోని కోటా వీధి నుంచి బోణంతో రైతులు, మహిళలు, చిన్నారులు సుంకులా పరమేశ్వరిదేవి ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. చిన్నారులు కృష్ణానది నీటిని కలశాలతో తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం మున్సిపల్ ౘైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

ఆత్మకూరు: పట్టణ శివారులోని పంట పొలాల్లో వర్షం కోసం ముస్లిం సోదరులు మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే లింగమయ్యకు కూడ ప్రత్యేక పూజలు నిర్వహించారు కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు అష్రఫ్‌అలీ, కార్యదర్శి శ్రీనివాసులు, నరసింహ, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్



ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్ అని రాష్ట్ర శాప్ మాజీ ౘైర్మన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్లోక స్కూల్‌లో క్రీడా ప్రపంచ దినోత్సవం, ధ్యాన్ చంద్ జయంతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ 1929, 1932, 1936 క్రీడల్లో దేశానికి వరుసగా బంగారు పతకాలు తెచ్చిపెట్టిన ఘనత ధ్యాన్ చంద్‌కే దక్కిందన్నారు. మెరుపు వేగంతో గోల్స్ చేయగల మాంత్రికుడిగా చరిత్రలో సుస్థిర స్థానంలో నిలిచారని స్పష్టం చేశారు. ధ్యాన్ చంద్ ఆటను చూసి హిట్లరు జర్మనీ పౌరసత్వంతో ఆర్మీలో కీలక పదివిని ఆఫర్ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ౘైర్మన్ శ్రీధర్ రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు రమేష్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.